క్లుప్తంగా

తెరుచుకోని రక్తపరీక్ష కేంద్రం



మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని మలేరియా చికిత్స రక్తపరీక్ష కేంద్రం తలుపులు వారం రోజులుగా తెరుచుకోవడం లేదు. ఇక్కడ సిబ్బందికి రాజరాజేశ్వరిపేటలో అతిసార ప్రబలిన సందర్భంగా డ్యూటీలు వేశారంటూ ఈ పరీక్ష కేంద్రాన్ని పూర్తిగా మూసివేయడం గమనార్హం. అసలే జ్వరాలు అధికంగా ఉన్న ఈ సమయంలో మలేరియా రక్త పరీక్ష కేంద్రం లేకపోవడంతో రక్త పరీక్షలు, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కోవిడ్ సమయంలో సైతం ఇక్కడ సేవలు అందించారని, ప్రస్తుతం ఒక్క ఉద్యోగినైనా అందుబాటులో ఉంచకుండా రక్తపరీక్ష కేంద్రాన్ని మూసివేయడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మలేరియా రక్తపరీక్ష కేంద్రాన్ని తెరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనం



విజయవాడ కల్చరల్: సాహితీ సంస్థల ఐక్యవేదిక, తెలుగు కళారత్నాలు, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా కళావేదికపై గురువారం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనం అందరినీ అలరించింది. ఈసందర్భంగా చిట్టిబాబు, కేవీబీ మూర్తి, ఉమాబలరాం, గోళ్ళ నారాయణరావు, చంద్రశేఖర్, డాక్టర్ భాగ్యశ్రీ, మీరాకుమార్, గాయనీ గాయకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన భవానీపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు...భవానీపురానికి చెందిన ఓ మహిళకు ఆరేళ్ల కిందట అబ్దుల్ హఫీజ్‌తో వివాహమైంది. ఇద్దరికీ రెండో వివాహం. హఫీజ్ తనభార్య మేనత్తతో వివాహేతర సంబంధం పెట్టుకోగా వద్దని భార్య వారించినా వినిపించుకోలేదు. ఆమెతోనే ఉంటానని, కావాలంటే నీకు విడాకులు ఇస్తానంటూ హఫీజ్ తన భార్యను బెదిరించాడు. అదేవిధంగా నిత్యం మద్యం సేవించి వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో అతని వేధింపులు భరించలేని వివాహిత తానువాడే మందులు అధిక డోసు తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమె వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేసి కేసు నమోదు చేశారు.

స్థల యజమానిని బెదిరించిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థలయజమానిని బెదిరించిన వ్యక్తిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చిట్టినగర్ కేటీ రోడ్డుకు చెందిన చుంచు నరసింహారావుకు విద్యాధరపురం లక్ష్మీనగర్‌లో ఖాళీ నివేశన స్థలం ఉంది. ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున స్థలం ప్రహరీ గోడకు టీ రాజేష్‌నాయుడు పేరుతో బ్యానర్‌తోపాటు ఐరన్ కంటైనర్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చుంచు నరసింహారావు తనస్థలం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి కంటైనర్‌ను తొలగించాలని రాజేష్‌నాయుడును కోరగా, ఐరన్ కంటైనర్ తీసేది లేదని, దిక్కున్నచోట చెప్పుకో అంటూ బెదిరించాడు. దీంతో నరసింహారావు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దసరా వేడుకలకు ఘాట్లు శుభ్రం



పటమట(విజయవాడ తూర్పు): ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రులకు కృష్ణానది తీరాన ఉన్న ఘాట్లను వీఎంసీ అధికారులు శుభ్రం చేస్తున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలోని పున్నమి ఘాట్, పద్మావతి ఘాట్, కృష్ణవేణి ఘాట్, భవానీ ఘాట్‌లలో పారిశుద్ధ్య పనులను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఎంవోహెచ్ డాక్టర్ అర్జునరావు మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఘాట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్నామని, రోజూ ఘాట్లను పరిశుభ్రంగా ఉంచేలా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని అన్నారు.

రోడ్డుపైనే బుడమేరు వ్యర్థాలు

- 20రోజులు దాటినా తొలగించని వైనం
- డయేరియా ప్రబలుతున్నా మారని పాలకుల తీరు
- అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ
- ఆందోళనలో ప్రజలు



జీవీఆర్‌నగర్‌లో డంపింగ్‌యార్డుకు తరలించకుండా రోడ్డుపైనే ఉంచిన బుడమేరు వ్యర్థాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని న్యూరాజరాజేశ్వరిపేటలో ఇటీవల డయేరియా ప్రబలి పలువురి మృతిచెందగా, వందలాది ప్రజలు అనారోగ్యానికి గురైనప్పటికీ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే విషయంలో శానిటేషన్ విభాగం అధికారులు ఏమాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదు. ఇటీవల వరదల సమయంలో బుడమేరులో వెలికితీసిన వ్యర్థాలను 20రోజులుగా తొలగించకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. నిత్యం రద్దీగా ఉండే 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు, దేవీనగర్‌లో తొలగించిన వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది మూడువారాలుగా గుట్టలుగా పోసి ఉంచారు. రోడ్డుపై పోసిన వ్యర్థాలను తొలగించకపోవడంతో ఈప్రాంతమంతా అపరిశుభ్రంగా మారి క్రిమికీటకాలు పెరిగిపోతున్నాయని, పందులు సైతం సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్య సమస్య కారణంగా అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఇక ఖాళీస్థలాల్లో కూడా అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో దోమలు వృద్ధిచెందుతున్నాయి. క్రిమికీటకాలు, విషసర్పాలు పెరిగిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా నగరపాలకసంస్థ అధికారులు స్పందించి రోడ్డుపై వదిలివేసిన బుడమేరు వ్యర్థాలను వెంటనే తరలించడంతోపాటు రోడ్డును శుభ్రం చేయించాలని, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీవాసులు కోరుతున్నారు. యజ మానులు ఖాళీస్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.




దావు బుచ్చయ్యకాలనీ మెయిన్‌రోడ్డులో తొలగించని బుడమేరు వ్యర్థాలు



దావు బుచ్చయ్యకాలనీలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీస్థలం

ఐక్యతా భావంతో ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు
- ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మంది వస్తారని అంచనా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పండుగలు, పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీకలని, ఐక్యత, సోదరభావంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రతి పండగనూ జరుపుకొంటున్నామని, ఇదే స్ఫూర్తితో దసరా ఉత్సవాల విజయవంతానికి చేయీచేయీ కలుపుదామన్నారు. ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేందుకు అవకాశముందన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ భక్తులకు విజయవాడ పర్యటన మధురానుభూతులను మిగిల్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తిచేసే వారిపై పటిష్ట నిఘా ఉంటుందని, శాంతియుత వాతావరణానికి భంగం కలిగించాలని యత్నించే వారిపై డేగ కన్ను ఉంటుందని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, పార్కింగ్ సదుపాయాలు, సీసీటీవీలు, డ్రోన్లతో నిఘా... ఇలా ప్రతి విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత, ఎండోమెంట్ ఏసీ ఎన్.షణ్ముగం, డీఎం డబ్ల్యూ అబ్దుల్ రబ్బానీ, వివిధ మతాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న లెక్చరర్లను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని పాలిటెక్నిక్, ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో మహిళా కాంట్రాక్ట్ లెక్చరర్లు గురువారం 36 గంటల ఆవేదన దీక్ష చేపట్టారు. వివిధ శాఖలలో 2014 ముందు కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న 11 వేల మంది ఉద్యోగులను గత ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేందుకు జీవో నంబర్ 114 ద్వారా విధివిధానాలు ప్రకటించి మూడువేల మందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించిందని లెక్చరర్లు పేర్కొన్నారు. అదే జీవోను నూతన ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

ఆవేదన దీక్షకు ఏపీ ఎన్జీజీవోస్ మద్దతు...

లెక్చరర్ల ఆందోళనకు ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ లెక్చరర్లతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అండగా నిలుస్తుందని వివరించారు. ప్రధాన కార్యదర్శి డివి రమణ మాట్లాడుతూ మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కాంట్రాక్టు ఉద్యోగులతో కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే జేఏసీ తరపున కూడా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె. జగదీశ్వరరావు, ఏపీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి బి.జె.గాంధీ, రాష్ట్ర అధ్యక్షులు వై.జాన్‌బాబు, ప్రధానకార్యదర్శి జి.ఎల్. మాణిక్యం, డిగ్రీ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి దాసరి రాజు, క్యాపిటల్ సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు సివిఆర్ ప్రసాద్ తదితరులతో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళా కాంట్రాక్టు లెక్చరర్లు పాల్గొన్నారు.

డ్రైవర్లందరికీ వాహనమిత్ర అమలు చేయాలి

కార్మిక సంఘాల డిమాండ్



ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, ఆటోడ్రైవర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు అందరికీ వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ గురువారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అలంకార్ సెంటర్ లోని ధర్నా చౌక్‌లో మహాప్రదర్శన, సభ నిర్వహించారు. ఆటో కార్మికులు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి ఏలూరు లాకులు, న్యూ ఇండియా హోటల్ సెంటర్ మీదుగా ధర్నాచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆంక్షలు లేకుండా డ్రైవర్లు అందరికీ వాహనమిత్ర అమలు, రూ.30వేల ఆర్థిక సహాయం, జీవో 21 రద్దు చేయాలన్నారు. తక్షణమే కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ లైసెన్స్ పొందిన డ్రైవర్లు అందరికీ వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 300 యూనిట్ల విద్యుత్ వినియోగం, ఐటీ రిటర్న్స్, చలానాల పేరుతో పథకానికి లక్షలాది మందిని అనర్హులుగా ప్రకటించడం అన్యాయమన్నారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు కె. పొలారీ మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సుమారు 4లక్షల మంది డ్రైవర్లకు వాహనమిత్రపథకం అందదని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఏపి ఆటో-ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్రప్రధానకార్యదర్శి ముజఫర్ అహమ్మద్, అధ్యక్షులు ఎస్.శివాజీ, కోశాధికారి కె.దుర్గారావు, నాయకులు డి.శ్రీనివాసరావు, ఎం.శంకర్, ఎం. రామకృష్ణ, ఆర్.రవీంద్ర, ఆర్.వెంకటేష్, ఉదయ్‌కిరణ్, ఈశ్వరరావు, కిరణ్ రాజ్ పాల్గొన్నారు.

చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి తరలిరండి



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం మచిలీపట్నంలో తలపెట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్, రాష్ట్ర వైద్య విభాగం ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎం.ప్రభుదాస్ కోరారు. ముత్యాలంపాడులో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పది మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. చలో మచిలీపట్నం మెడికల్ కాలేజీ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నాయకులు, ఆయా సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

ఆయుర్వేద ఔషధాలపై విద్యార్థులకు అవగాహన



లబ్బీపేట(విజయవాడతూర్పు): సహజ సిద్ధంగా తయారయ్యే ఆయుర్వేద ఔషధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా డాక్టర్ ఎన్.ఆర్.ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో గురువారం స్కూల్ అవుట్ రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన హెర్బల్ ఎక్స్‌పో, ఔషధ తయారీ స్టాల్స్, ఇతర ప్రదర్శనలను సందర్శించి ఆయుర్వేదం వైవిధ్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మల జ్యోతిభాయి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.బుల్లయ్య, ప్రొఫెసర్‌లు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ వ్యర్థాలు నిరంతరం తొలగించాలి



అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో నిరంతరం డీసిల్టింగ్ పనులు జరగాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన వన్‌టౌన్ తారాపేట, బీఆర్పీ రోడ్, నెహ్రూ రోడ్, పాడి వీధి ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఔట్ ఫాల్ డ్రెయిన్‌లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పని చేస్తూ వ్యర్థాల తొలగింపు.. డీసిల్టింగ్ పనులు చేపట్టాలన్నారు. మెషిన్లను వ్యర్థాలు తొలగించే ప్రక్రియలో పూర్తిస్థాయిలో ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వన్‌టౌన్ గాంధీ మహిళా కళాశాల వద్ద గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

ప్రజాధనాన్ని దండుకునేందుకు చిల్లర రాజకీయాలు

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలో నిర్వహించే దసరా ఉత్సవాల్లో నేడు భక్తి ముసుగులో కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దండుకోవాలనే దురాశతో చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజా సంక్షేమంపై ఏ మాత్రం అవగాహన లేని కేశినేని చిన్ని వ్యాపార దృక్పథంతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఇటీవల గొల్లపూడిలో వెలుగులోకి వచ్చిన స్థల వివాదం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం అని అన్నారు. జేబులు నింపుకొనేందుకే అమ్మవారి ఉత్సవాలను పక్కన పెట్టి 'విజయవాడ ఉత్సవ్' ప్రచారం చేస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. తమ నాయకులు పేర్ని నాని, దేవినేని అవినాష్‌లు మాట్లాడక పోతే గొల్లపూడి భూమిని కబ్జా చేసేవారని విమర్శించారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ.. రెండు రోజులుగా పేర్ని నాని, దేవినేని అవినాష్‌లు కూటమి ప్రభుత్వం చేస్తున్న కబ్జాలపై పోరాడుతున్నారని వివరించారు. మరో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా రెడ్డి మాట్లాడుతూ.. 15 నెలల కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి శూన్యమని ఆరోపించారు.

సచివాలయాల్లోనూ ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి



రాఘవయ్య పార్కు వద్ద కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛోత్సవ, స్వచ్ఛత ఈ సేవ-2025లో భాగంగా, ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ఆర్(రీయూస్, రీసైకిల్, రెడ్యూస్) కేంద్రం ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఆయన రాఘవయ్య పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 64 వార్డుల్లో 64, 9 ప్రత్యేకమైన ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రతి సచివాలయంలో కూడా ఒక ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజలు ఆర్ఆర్ఆర్ కేంద్రం వద్దకు వచ్చి, వారికి అవసరం లేని స్టీల్ పాత్రలు, వస్త్రాలు పుస్తకాలు, కాగితాలు, చెప్పులు, షూ, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతరత్రా సామాగ్రిని ఈ కేంద్రాలలో అందించవచ్చని, వాటి ద్వారా వ్యర్థాలను తగ్గించడం, పునర్వినియోగించడం చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): గద్దే వెంకట్రామయ్యనగర్ భక్తబృందం ఆధ్వర్యంలో 30వ డివిజన్ జీవీఆర్‌నగర్‌లో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు భక్తబృందం సభ్యులు గద్దే శ్రీను తెలిపారు. జీవీఆర్‌నగర్‌లో శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను భక్త బృందం సభ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రతి ఏటా భక్తులు, దాతల సహకారంతో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 22వ తేదీ నుంచి ప్రతీరోజూ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. 25వ తేదీ శుక్రవారం అమ్మవారికి శ్రీమహాలక్ష్మీ అలంకారం చేసి సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. . వచ్చేనెల 5వ తేదీ ఆదివారం సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి పురవీధులలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 12వ తేదీ ఆదివారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని వివరించారు. నవరాత్రి ఉత్సవాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భక్తబృందం సభ్యులు నూతక్కి శ్రీను, కొండా మహాలక్ష్మయ్య, సీహెచ్ సుబ్బారెడ్డి, అర్జా నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు

'వేగా' ఆషాడం లక్కీడిప్ విజేతల ఎంపిక



వేగాలో ఆషాడ లక్కీడిప్ విజేతలను ఎంపిక చేస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆషాడ మాసం సందర్భంగా వేగా జూవెలర్స్ షోరూమ్‌లో నిర్వహించిన లక్కీడిప్ విజేతలను గురువారం ఎంపిక చేశారు. ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకుని వేగా జ్యూవెలర్స్ అనేక ఆఫర్లను అందించడమే కాక, ఆ సమయంలో ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి లక్కీ కూపన్లు అందించారు. ఆ కూపన్లు డ్రా తీసి విజేతలను ప్రకటించారు. విజేతలుగా ఎంపికైన నసీమబేగం అనిశెట్టి(నరసరావుపేట), కొల్ల బాలకృష్ణ(విజయవాడ), విజయకుమారి బెల్లంకొండ(విజయవాడ), లక్ష్మీ తిరువీధుల(విజయవాడ), హరిబాబు నల్లాని (గుంటుపల్లి)లకు చెందిన వారికి ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు విలువ చేసే బంగారు/డైమండ్ నెక్లెస్‌లను బహుమతిగా అందచేసినట్లు వేగా జూవెలర్స్ సంస్థ చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వనమాలు తెలిపారు.

ఘనంగా అక్కినేని జయంతి వేడుకలు



బ్రహ్మానందరావు, చింతా వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు కొనియాడారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతి వేడులకను నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో అక్కినేని యుగం స్వర్ణయుగమన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు మాట్లాడుతూ సినీరంగానికి అక్కినేని అందించిన సేవలను కొనియాడారు. వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, పరుచూరి విజయలక్ష్మి, మహిళా జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనారామన్, బోడి ఆంజనేయరాజు, బీవీ వీరభద్రరావు, కోటా వెంకటేశ్వరెడ్డి పాల్గొన్నారు. గాయకులు మల్లాది స్వాతి, అయ్యప్పన్, మహేశ్వరి, మౌనికలు అక్కినేని నటించిన చిత్రగీతాలను ఆలపించారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు, చింతా వెంకటేశ్వర్లును నిర్వాహకులు సత్కరించారు.

రేపు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వేడుకలు ...

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పద్మవిభూషణ్ నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ తెలిపారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అక్కినేని విగ్రహం వద్ద అక్కినేని జయంతి వేడుకలు ఏర్పాటు చేశామన్నారు. ఈ వేడుకలకు అక్కినేని అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు. సొసైటి కోశాధికారి గుర్రం ఏడుకొండలు మాట్లాడుతు అక్కినేని నాగేశ్వరరావు జయంతి పురస్కరించుకుని పేద పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, వాంబే కాలనీలోని మాతృదేవోభవ వృద్ధుల సేవాసంస్థకు నిత్యావసర సరుకుల పంపిణీ చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో ఎక్స్‌రే ప్రధానకార్యదర్శి బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు.